## ఎమ్మెల్సీ ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వహించాలి

### కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: ఈనెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల విధులను పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పీఓలు, ఏపీఓలకు హితవు పలికారు. ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు తొలి విడత శిక్షణ తరగతులను మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డీఆర్ఓ, పీడీ డ్వామాతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు నియమించబడిన పీఓలు, ఏపీఓలు ఎన్నికల ప్రక్రియను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, ఎటువంటి సందేహాలున్నా, వాటిని అడిగి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. పోలింగ్ ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తూ.చ పాటించాలని సూచించారు. ఈ నెల 27న ఉదయం 8.00 గం.ల నుంచి సాయంత్రం 4.00 గం.ల వరకు పోలింగ్ జరగనుందని, ఆ సమయంలో పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్‌లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారికి ఓటింగ్ అవకాశం కల్పించాలని తెలిపారు. పోలింగ్ ముందు రోజున ఉదయం 7.00 గం.లకు పార్వతీపురం కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటరుకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో చేరుకోవాలని అన్నారు. పంపిణీ కేంద్రాల వద్ద అందించే బ్యాలెట్ బాక్సులను, పోలింగ్ సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం జాగ్రత్తగా పరిశీలించుకొని, తక్కువ గల సామాగ్రిని తక్షణమే అడిగి పొందాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల లోనికి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని, దీన్ని దృష్టిలో ఉంచుకొని డిపాజిట్ సెంటరును ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె.రామ చంద్రరావు, పీఓలు, ఏపీఓలు, ఎన్నికల సూపర్ వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లచ్చయ్యపేటలో రీ సర్వే పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న భూముల రీసర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో రైతుల భూముల్లో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. మ్యాప్‌లో గ్రామ భూవిస్తీర్ణం, ఇప్పటివరకు పూర్తిచేసిన సర్వే, ఇంకా చేపట్టనున్న సర్వే వివరాలను మండల సర్వేయర్ చంద్రరావును అడిగి తెలుసుకున్నారు. భూమి కొలతలు వేసేముందు రైతులకు ఫాం -19 నోటీసులు ఇస్తున్నది లేనిది, అడంగల్‌లోని రైతుల పేరు మీద ఉన్న భూమి విస్తీర్ణం కచ్చితంగా కొలతలు వేస్తున్నారా, లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నోటీసులు అందించి వారి సమక్షంలోనే రోవర్ సహాయంతో ఖచ్చిత మైన హద్దులను నిర్ణయించి రైతులకు భూమిని అప్పగించాలని సూచించారు. త్వరితగతిన రీ సర్వే పూర్తి చేయాలని తహశీల్దార్ ప్రసన్న కుమార్‌ను సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ ఏ.ఉమా మహేశ్వరరావు, ఎంపీడీఓ పాండ్రంకి త్రివిక్రమరావు, ఈఓపీఆర్డీ కుమార్ వర్మ, గ్రామ రెవెన్యూ అధికారి కిరణ్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, విలేజ్ సర్వేయర్ మన్మధరావు, సర్వేయర్ల బృందం, మాజీ సర్పంచ్ గుంపస్వామి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్‌పై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర - కురుపాం: మక్కువ మండల జర్నలిస్ట్ మల్యాడ రామారావుపై భౌతిక దాడికి పాల్పడిన టీడీపీ మండల కన్వీనర్ గుల్ల వేణుగోపాల్ నాయుడుపై కేసు నమోదు చేసి పార్టీ పదవి నుంచి తప్పించాలని కురుపాం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహశీల్దార్ ఎం.రవణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కార్యదర్శి సీనియర్ జర్నలిస్ట్ నెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ విస్మరించి ప్రవర్తించే వారిపై జిల్లా ఎన్నికల అధికారి చర్యలు తీసుకోవాలని, భౌతిక దాడికి పాల్పడి చంపేస్తానంటూ బహిరంగ ప్రకటన చేసిన గుల్ల వేణుగోపాల్ నాయుడుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి గంగునాయుడు, ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రృధ్వీ, డిల్లేశ్వరరావు, సంతోష్, ప్రదీప్, రామకృష్ణ, అనీల్, గోపి, శబరీష్, మణి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలంలో అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణ 20వ తేదీ వరకు జరగనుంది. మక్కువ మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ ప్రారంభమైంది. చిన్న పిల్లల యొక్క మానసిక, శారీరక అభివృద్ధి మెరుగుపరుచుటకు, అంగన్వాడీలను బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ ట్రైనింగ్స్‌ని ప్రథమ్ సంస్థ సహకారంతో ప్రభుత్వం నిర్వహిస్తుందని డీఈఓ తిరుపతినాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ 1 సత్యనారాయణ, ఎంఈఓ 2 శ్యాంసుందర్, సీడీపీఓ బి.అనంతలక్ష్మి, సూపర్ వైజర్స్ పి.రాజశ్రీ, ఎన్.లీలావతి, స్కూల్ టీచర్లు వెంకటరమణ, ఉమామహేశ్వరరావు, జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక విద్య పటిష్టంగా అమలు చేయాలి

### ఎంఈఓ 1 సామల

విశాలాంధ్ర - బలిజిపేట: అంగన్వాడి కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను పటిష్టంగా అమలు చేయాలని ఎఫ్ఎల్ఎన్ కోర్స్ డైరెక్టర్, బలిజిపేట మండల విద్యాశాఖాధికారి-1 సామల సింహాచలం అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడి టీచర్లకు ఆరు రోజుల ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమాన్ని ఎంఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యలో నూతన విద్యా విధానాలను ఈ శిక్షణలో బాగా అవగాహన చేసుకోవాలని కోరారు. ప్రాథమిక విద్యకు పునాది స్థాయి అంగన్వాడి కేంద్రాలని, కాబట్టి ఐసిడిఎస్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ఈ కేంద్రాల్లో 0 నుండి 5 సంవత్సరాల బాల బాలికలకు నూతన బోధనా పద్ధతుల ద్వారా విద్యను అందించడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. మొదటి విడత మూడు రోజులపాటు 20వ తేదీ వరకు, రెండో విడత 22 నుండి 25 వరకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా ఎస్.వెంకటేష్, కె.రమేష్ బాబు, గుల్ల రామారావు వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 కె.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాస రావు, ఐసిడిఎస్ సీడీపీఓ సులేఖ, సూపర్వైజర్ పద్మావతి, స్టాఫ్ సెక్రటరీ ఎం.పైడపు నాయుడు, అంగన్వాడీ టీచర్లు, ఎంఈఓ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఆశ్రమ పాఠశాల వ్యాయామ సంచాలకులు ఎంపిక

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో గల వేటగానివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల వ్యాయామ సంచాలకులు పి.కేశవరావు జాతీయస్థాయి సివిల్ సర్వీస్ పురుషుల అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2024-25లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 200 మీటర్ల పరుగు పందెం, రిలే పరుగు పందెంలో జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నారని మన్యం జిల్లా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎం.వాసుదేవరావు నాయుడు తెలియజేశారు. రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ పోటీలు నవంబర్ 6, 7వ తేదీల్లో విజయవాడలో గల ఇందిరాగాంధీ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో జరిగిన పోటీలలో 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనారని జాతీయ స్థాయి పోటీలు ఈనెల 19 నుండి 21 వరకు పంజాబ్ రాష్ట్రంలో గల చండీగర్‌లో జరగనున్న పై పోటీలలో పాల్గొను టకు అనుమతి ఉత్తర్వులు ప్రాజెక్టు అధికారి అసుతోస్ శ్రీవాత్సవ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పి.కృష్ణవేణి జారీ చేశారన్నారు. ఈయన ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుల్ల వెంకట్ నాయుడు, మన్యం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు అభినందించారు.

## పీఎం కిసాన్ రీ సర్వే వేగవంతం చేయాలి

### - ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - సీతంపేట: పీఎం కిసాన్ రీ సర్వేను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీఎం కిసాన్ రీ సర్వే ప్రక్రియలో అగ్రికల్చర్ అసిస్టెంట్లకు వీఆర్వోలు సహకరించాలని అన్నారు. రీ సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు. అదే విధంగా గృహ నిర్మాణాలకు సంబంధించిన ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలని వీఆర్వోలకు సూచించారు. వీఆర్వోలు మంజూరు చేసిన ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్‌లను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి గృహ నిర్మాణ పనులను ప్రారంభించుటకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఏఈకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ గీతాంజలి, అగ్రికల్చర్ ఏవో శ్రీదేవి, హౌసింగ్ ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

విశాలాంధ్ర - పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. క్యాంప్ ఆఫీస్ వద్ద ఎమ్మెల్యే విజయ్ చంద్ర నిర్వహించిన ప్రజా దర్బార్‌కు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు చెప్పగా వారి సమస్యలను సావధానంగా విని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## పాఠశాల ఆవరణలో చెట్లు నరకడం తప్పు

### - ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తా....
### - జిల్లా ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంపౌండ్ వాల్ పేరిట అవసరం లేని చెట్లు నరకడం తప్పేనని జిల్లా ఉప విద్యా శాఖాధికారి వి.కృష్ణమూర్తి అన్నారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈనెల 15వ తేదీన విశాలాంధ్ర పత్రికలో వచ్చిన పాఠశాల ఆవరణలో చెట్లు అక్రమ నరికివేత అనే కథనంపై ఆయన విచారణ జరిపారు. ముందుగా ఆయన పాఠశాల ఆవరణలో నరికిన 63 చెట్లను పరిశీలించి ఉపాధి హామీ పథకం ద్వారా నాలుగు భాగాలుగా 39 లక్షల రూపాయలతో మంజూరైన ప్రహరీ గోడ నిర్మాణానికి అడ్డంగా ఉన్నాయని గుత్తేదారుల ద్వారా నరికివేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌రావుపై డిప్యూటీ డిఈవో కృష్ణమూర్తికి గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెట్లు నరకడం మీకు తెలిసే జరిగిందా తెలియక జరిగిందా అడిగిన ప్రశ్నకు పాఠశాల యాజమాన్య కమిటీ తీర్మానం ప్రకారం చెట్లు కొట్టడం జరిగిందని చెప్పడంపై డిప్యూటీ డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది దారుణమని దీనిపై ఉన్నతాధికారులకు రెండు రోజుల్లో సమగ్ర నివేదిక అందజేస్తానని తెలియజేశారు. ఇదిలా ఉండగా పాఠశాల చుట్టూ వ్యవసాయం చేసుకుంటున్న రైతులు తమకు గతంలో వలె పాఠశాల మధ్య నుండి వెళ్లేందుకు రహదారి వదలమని డిప్యూటీ డీఈవో కృష్ణమూర్తి ముందు కోరగా ఇది రెవెన్యూ పరిధిలో విషయమని రెవిన్యూ సిబ్బందితో రైతులు మాట్లాడి ఆ ప్రాప్తికి నిర్ణయం తీసుకోవాలని ఆయన చెప్పారు.



## రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

### జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర - రంపచోడవరం: గిరిజన ప్రాంతంలో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 11 నెంబర్లతో ఆధార్ అనుసంధానంతో రైతుల ఐడిని అప్లోడ్ చేయాలని అన్నారు. పీఎం కిషన్ పథకం ద్వారా జిల్లాలో ఆర్గానిక్ పంటలు ఎంతమంది వేయిచున్నది ఆయన ఆరా తీశారు. అదేవిధంగా పీఎం కిసాన్‌లో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులు ఎంతమంది ఉన్నది ఆరా తీశారు. రంపచోడవరం డివిజన్లో నూతనంగా ఎన్నిక కాబడిన పీసా ఉపాధ్యక్షులకు, కార్యదర్శులకు అవగాహన శిక్షణ ఏ విధంగా ఇచ్చింది ఆయన ఆరా తీశారు. పాడేరు చింతూరు డివిజన్లో ఆర్గానిక్ పంటలకు ప్రోత్సహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఆర్గానిక్ వ్యవసాయం చేయుటకు ముందుగా రైతులను గుర్తించి క్లస్టర్ల ద్వారా యాక్షన్ ప్లాన్ తయారుచేసి సమర్పించాలని ఆయన అన్నారు. ఆర్గానిక్ పంటలు రైతులు వేయుటకు ఏమేమి కావాలో నివేదిక తయారు చేసే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు సచివాలయాల పరిధిలో సంబంధిత అధికారులకు టార్గెట్ ఇవ్వాలని ఆయన అన్నారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కొరకు మండలానికి 100 ఎకరాలు రైతులకు అవగాహన కల్పించి గుర్తించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్ప శ్రీ, డివిజనల్ ఫారెస్ట్ అధికారి రవీంద్ర ధామ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నందు, జిల్లా ఆర్టికల్చరల్ అధికారి ఎ.రమేష్ కుమార్, జిల్లా నేచురల్ ఫామింగ్ అధికారి ఎల్. భాస్కరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సిహెచ్.నరసింహం, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, పిహెచ్ఓ చిట్టిబాబు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే.సావిత్రి, ఉపాధి హామీ పథకం ఎపిడి జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - చింతపల్లి/జీకే వీధి: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండేలా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా యాంటీ టీబీ వారోత్సవాలు నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి సంబంధిత టీబీ యూనిట్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 17 నుండి 23 వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయవలసిందిగా సూచించింది. గూడెం కొత్త వీధి మండలం జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సిబ్బంది మంగళవారం క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే కఫం పరీక్ష చేయించుకోవాలని అన్నారు. అనంతరం మొండిగెడ్డ, వంచుల, చౌడపల్లి తదితర పాఠశాలల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి ఎస్. జి అశోక్ కుమార్, ఎస్. టి.ఎల్ ఎస్. వెంకటరావు, ఎం.ఎల్ హెచ్.పి లు. గ్రేస్, రమణి, లోవ, వైద్య సిబ్బందితోపాటు ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య ఉండాలి

### వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరి

విశాలాంధ్ర - అనంతగిరి: మండల పరిధిలో భూమి ఉన్న ప్రతి వ్యవసాయ రైతుకు గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని అనంతగిరి వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలో సుమారు పదివేల మంది వ్యవసాయ రైతులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని అప్పుడే ప్రభుత్వం అందించే రైతు సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రైతుకు జరాయితీ పట్టా ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ (ఆధార్ కార్డు లింక్ తో) తప్పనిసరిగా ఉండాలని అప్పుడే గుర్తింపు నెంబరు వస్తుందని తెలిపారు. సచివాలయాల్లో ఉన్న వ్యవసాయ అసిస్టెంట్లు వద్ద ఈ యూనిక్ నెంబర్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈనెలాఖరులోగా ప్రతి రైతు గుర్తింపు సంఖ్య పొందాలని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెలాఖరులోగా ప్రతి ఒక్క రైతు గుర్తింపు నంబరు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి తహశీల్దార్ మాణిక్యం వీఆర్వోలు పాల్గొన్నారు.

## రైతుల నుండి కాఫీ కొనుగోలు

విశాలాంధ్ర - జీకే వీధి: పెదవలస పంచాయతీ పరిధి చాపారతి పాలెం రంపులు గ్రామంలో గిరిజన సహకార సంస్థ ఆర్గానిక్ సర్టిఫికెట్ కలిగిన రైతుల నుండి కాఫీ కొనుగోలు చేసిన కాఫీ బస్తాలను జీసిసి లారీతో రంపులు నుండి రింతాడకు తరలించడం జరిగిందని సేల్స్ మెన్ పి.మాధురి తెలిపారు. గత మూడు రోజుల నుండి రైతుల నుండి కొనుగోలు చేసిన ఆర్గానిక్ కాఫీలను మంగళవారం గిరిజన సహకార సంస్థ సంబంధించిన లారీలో 200 కాఫీ బస్తాలను లోడ్ చేసి రింతాడకు తరలించడం జరిగిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పెదవలస సంకాడ రంపులు సేల్స్ మెన్లు పి.మాధురి, గుమ్మడి బాలరాజు, గబులంగి భవాని కుమారి, నాయకులు మాజీ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ వసపరి ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వీరోజి త్రిమూర్తులు, టిడిపి నాయకులు గబులంగి తెల్లన పాల్గొన్నారు.

## బక్కగడ్డలో రహదారి సమస్య పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - జీకే వీధి: జీకే వీధి మండలం వంచుల పంచాయితీ బక్కగడ్డ గ్రామంలో జనసేన పార్టీ నాయకులు పర్యటించారు. గ్రామస్థులు వారి యొక్క సమస్యలు తెలియజేస్తూ గ్రామానికి ముఖ్యంగా రోడ్డు సమస్య ఉందని, అనేక సార్లు సమస్యను గత వైసీపీ పార్టీ నాయ కులకు, స్థానిక నాయకులకు, ప్రభుత్వ అధికారులకు తెలియజేసిన పరిష్కారం కాలేదు అన్నారు. రోడ్డు సదుపాయం లేనందువలన అత్యవసర సమయంలో హాస్పిటల్‌కి తీసుకొని వెళ్ళాలంటే డోలు మోత సహాయంతో వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గ్రామంలో నీటి సమస్య కూడా అధికంగా ఉందని, ఇప్పుడు వస్తున్న ఎండాకాలం సీజన్లో త్రాగునీటి సమస్య అధికంగా ఉంటుందన్నారు. ఇంకా గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని జనసేన పార్టీ నాయకులకు వివరించారు. అరకు పాడేరు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న అనేక సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కూడా మధు, కొయ్యం ఇమ్మానుయేల్(సిద్దు), (సోషల్ మీడియా ఐటీ ఇంచార్జ్) పోటుకూరి, జయరాజు గ్రామస్థులు పాల్గొన్నారు.

## శిశు అభివృద్ధిపై అంగన్వాడీలకు శిక్షణ

విశాలాంధ్ర - జీకే వీధి : మండలంలోని జి.టీ. డబ్ల్యూ.ఏ.ఎస్ (బాలికల) పాఠశాల నందు జ్ఞానజ్యోతి 120 రోజుల కార్యక్రమాల్లో భాగంగా గూడెం కొత్త వీధి సిబ్బందికి శిక్షణ కార్యక్రమానికి మండల ప్రాజెక్ట్‌లో గల ఆరు సెక్టార్‌లలో గల మెయిన్ అంగన్వాడి కార్యకర్తలు, సపోర్టింగ్ స్టాఫ్ మొత్తం 66 మంది ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ఐ.సి.డి.ఎస్. (సి.డి.పి.ఓ) మండల ఎడ్యుకేషన్ అధికారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి ఎస్.కుమార్, సత్తిబాబుడి వలసమ్మ, కే.రామలక్ష్మి, డి.కృష్ణకుమారి తరగతులను ప్రారంభించారు.

## ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ

విశాలాంధ్ర - కొయ్యూరు: అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల మానసిక, ఆరోగ్య పరిస్థితిపై అవగాహన కల్పించేందుకు కార్యకర్తలకు తగిన సూచనలు అందించేందుకే శిక్షణ అందిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కే.విజయకుమారి తెలిపారు. మండల కేంద్రమైన కొయ్యూరులో బుధవారం స్థానిక జిహెచ్ఎస్ పాఠశాలలో మండల పరిధిలో పని చేసే అంగన్వాడీ కార్యకర్తలకు ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంపై పీఓ విజయకుమారీ, మండల విద్యాశాఖ అధికారి రాంబాబు, తదితరులు శిక్షణ ఇచ్చారు. పిల్లలకు 5రకాల అభివృద్ధి స్థాయి కార్యక్రమాలపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ, డీపీఆర్ రిసోర్స్ పర్సన్ సురేష్ కుమార్, టీచర్స్ తలుపులు, సూపర్వైజర్ సునీతా, కొండమ్మ, కనక మహాలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ తదితరులు, డీఈఓ భాను, పి పి శేఖర్ పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

విశాలాంధ్ర - హుకుంపేట: ఈనెల 18 నుండి 25 వరకు నిర్వహిస్తున్న (ఎస్ఎఎల్‌టి) సహాయకరమైన ఆంధ్ర అభ్యాసన పరివర్తన శిక్షణ కార్యక్రమం అంగన్వాడి కేంద్రాలలో విద్యను అభ్యసిస్తున్న పిల్లలకు ఎంత గానో ఉపయోగపడుతుందని జిల్లా సర్వ శిక్ష అభియాన్ పర్యవేక్షణ అధికారి కె.భాస్కరరావు పేర్కొ న్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల హై స్కూల్‌లో అంగన్‌వాడి వర్కర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమి క పాఠశాలల కు అనుసంధానం చేస్తూ పిల్లలకు పౌష్టికాహారమే కాకుండా విద్యాభివృద్ధికి కృషిచేయాలని కృత నిశ్చయంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ద్వారా పిల్లలలో శారీరక అభివృద్ధి, మానసిక అభివృద్ధి, భాషాభివృద్ధి, సామాజిక అభివృద్ధి, సాంస్కృతిక అభివృద్ధి, పెంపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఈశ్వరరావు, చెల్లయ్య, సీడీపీఓ బాలచంద్రామణి దేవి పాల్గొన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలి

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: గ్రామ స్థాయిలోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించి వారి ఎదుగుదలకు తోడ్పాటునిచ్చి వారి విలువలను కాపాడాలని ఎంపీడీఓ ప్రేమ్ కుమార్ సూచించారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ సమన్వయంతో అంగన్వాడీలకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. దుంబ్రిగుడ బాలుర, జాముగుడ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో అంగన్వాడీల శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో సమగ్ర అభివృద్ధితోపాటు విలువలతో కూడిన ఆట, పాట, మాట, విద్య, రాయడంలో పెంపొందించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి సుందర్రావు, ఇన్చార్జి తహసీల్దార్ ముజీబ్, సీడీపీవో నీలిమ, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజీ: 2
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
బుధవారం 19, ఫిబ్రవరి 2025

## చెట్టు నుంచి జారిపడిన గిరిజనుడికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: వంట చెరకు కోసం చెట్టెక్కిన ఓ గిరిజనుడు ప్రమాదవశాత్తు జారిపడి గాయాలపాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. లైగండ పంచాయతీ ఇసుకగరువు గ్రామానికి చెందిన టి.ప్రశాంత్ కుమార్ మంగళవారం ఉదయం వంట చెరకు సేకరణకు చెట్టెక్కాడు. వంట చెరకు సేకరణలో గొడ్డలి వేస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు నుంచి జారిపడ్డాడు. ఘటనలో కుడి కాళ్లు విరిగి రక్తస్రావంతో కొట్టుమిట్టడాతున్న బాధితుడిని ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబీకులు 108కు సమాచారం అందించి అరకు హాస్పిటల్‌కు తరలించారు.

## అనారోగ్యంతో ఉన్న మహిళకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన మహిళకు రాజవొమ్మంగి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించిన సంగతి తెలిసిందే. మంగళవారం పేద కుటుంబానికి పాత్రికేయులు ఆర్థిక సాయం అనే కథనం పత్రికల్లో వచ్చిన తరువాత స్పందించిన గిరిజన సంఘం సభ్యులు ఆమెకు ఆర్థిక సహాయాన్ని అందించారు. రాజవొమ్మంగి మండలం చికిలింత గ్రామానికి చెందిన జర్రా నూకరత్నం అనే గిరిజన మహిళ కొన్ని రోజులుగా అన్నవాహిక వ్యాధితో బాధపడుతుంది. ఇదే విషయం పలు వార్త పత్రికల ద్వారా వెలుగులోకి రావడంతో, గిరిజన సంఘం సభ్యుడు, చికిలింత గ్రామ సర్పంచ్ కోండ్ల సూరిబాబు ఆధ్వర్యంలో సంఘం నాయకులు పి.సత్యనారాయణ, పి.రాంబాబు, పి.పాపరావులు ఆ కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు,. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, బంధువులు ఉన్నారు.

## రాజుల బాబు పండగలో విలువిద్యకు ప్రాధాన్యం

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలోని రింతాడ పంచాయతీ సచివాలయం-2 పరిధిలోని దుచ్చరపాలెం గ్రామంలో అంగరంగ వైభవంగా రాజుల బాబు పండగను గ్రామస్తులు నిర్వహించారు. ప్రతి ఏట నిర్వహించే రాజుల బాబు పండగను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విలువిద్య పోటీలు నిర్వహించి వారికి బహుమతులు ప్రధానం చేసి ప్రోత్సహించారు. ఈ పోటీలలో సాగిన బాలయ్య పడాలల్ ప్రథమ బహుమతి పొందగా రెండవ బహుమతి సాగిన లక్ష్మణ్, మూడో బహుమతి వంతల సోమరాజు గెలుపొందారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు ఎస్వీసీటీ కుటుంబ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాగిన పుష్పకుమారి, గ్రామ పెద్ద సాగిన రామరాజు పడాల్, వార్డ్ మెంబర్ సాగిన జోగి పడాల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## చత్తీస్‌ఘడ్‌లో బంద్ ప్రభావంతో ఆంధ్ర పోలీసుల హై అలర్ట్

విశాలాంధ్ర - చింతూరు: ఈనెల 9వ తేదీన బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా చత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టులు మంగళవారం సంపూర్ణ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో చింతూరు, ఎటపాక, కూనవరం, విఆర్ పురం మండలాల్లో పోలీసులు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో అలెర్ట్ అయ్యారు. చింతూరు మండలంలో సీఐ తెల్లం దుర్గాప్రసాద్ సూచనల మేరకు ఎస్ఐ రమేష్ మావోయిస్టుల బంద్ సందర్భంగా ఒరిస్సా, చత్తీస్‌ఘడ్ నుండి వచ్చి వెళ్లే వాహనాలను విస్తృతంగా తనఖీలు చేపట్టారు. బంద్ దృష్ట్యా భద్రాచలం వైపు వెళ్లాల్సిన వాహనాలను మంగళ, బుధవారాల్లో రాత్రిళ్ళు కూనవరం మీదుగా వాహనాలను మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

## శంబర పోలమాంబ ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో రాష్ట్ర గిరిజన పండగ జాతరగా పేరు పొందిన శ్రీశ్రీ శంబర పోలమాంబ 4వ జాతర భక్తులతో వనం గుడి, చదురు గుడి వద్ద భక్తులు పోటెత్తారు. మొదటి వారం జాతర తలపించేలా భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కార్య నిర్వాహక అధికారి వివి సూర్యనారాయణ అన్నారు. లడ్డు ప్రసాదాలను అందుబాటులో ఉంచారు. మొదట వనముగుడి వద్ద మొక్కులు చెల్లించుకుని అనంతరం గ్రామంలో చదురు గుడివద్దకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాలూరు సీఐ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

## కెవికెలో 41వ వ్యవసాయ శాస్త్రియ సలహా సమావేశం

విశాలాంధ్ర - కురుపాం: 2025-26 సంవత్సరంలో రస్యాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందించబోయో సేవలు, ప్రణాళికల తయారీపై మంగళవారం 41వ శాస్త్రీయ వ్యవసాయ సలహా సమావేశం కెవికె ప్రోగ్రాం అధికారి డా ఎస్.ధృవ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సహాయ ప్రభందకులు డాక్టర్ అప్పలనాయుడు, వ్యవసాయ విస్తరణ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.ముకుందరావు ప్రణాళిక తయారీపై పలు సూచనలు సలహాలు చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పాడి పరిశ్రమలో అధిక లాభాలు రైతులు పొందేలా 2025-26 వ్యవసాయ సంవత్సరం ప్రణాళికను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ, గృహ విజ్ఞానం, పశు సంవర్ధక, ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలకు ప్రాథమిక విద్యపై అవగాహన కోసం శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు సూరిదేముడు, వెంకటరమణలు తెలిపారు. మంగళవారం జోగమ్మపేట కేజీబీవీలో ఏర్పాటు చేసిన 6రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆరు రోజులపాటు మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల సిబ్బందికి బ్యాచుల వారీగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కీ రిసోర్స్ పర్సన్‌గా సూపర్ వైజర్ పూర్ణిమా, రిసోర్స్ పర్సన్లుగా కూర్మినాయుడు, గణపతులు ప్రాథమిక విద్యపై, సాల్ట్, ఈసిసిఈ తదితర అంశాలను వివరించారు.

## పాఠశాలను పరిశీలించిన ఎంపీడీవో

విశాలాంధ్ర - సీతంపేట: మండల పరిధిలో గల కారిమానుగూడ పాఠశాలను ఎంపీడీవో గీతాంజలి పరిశీలించారు. ఉపాధ్యాయులు సింహాద్రి, పిల్లలతో మాట్లాడారు. రెండవ తరగతి విద్యార్థిని సుచిత్రను బోర్డుపై ఇచ్చిన లెక్కను పూరించమని చెప్పడంతో ఆమె వెంటనే చేయడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కుడ్డపల్లి గ్రామపంచాయతీలో అంగన్వాడి, పాఠశాలను సందర్శించడం జరిగింది. కుడ్డపల్లి గ్రామంలో అంగన్వాడి వెనక వీధిలో ఎస్ డబ్ల్యూ పిసి వరకు సిసి రోడ్డు పనిని పర్యవేక్షించారు.

## 26వ రోజుకు చేరిన దీక్ష

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయానికి సాగు భూములు ఇచ్చిన గిరిజనులు చేపడుతున్న ఆందోళన దీక్ష 26వ రోజుకు చేరుకుంది. బాధిత గిరిజనులు డొంబు, రాంచందర్ మాట్లాడుతూ పాఠశాల నిర్మాణానికి సాగు భూములు ఇచ్చి ఏడేళ్లు కావస్తోందన్నారు. లిఖితపూర్వకంగా ఉపాధి కల్పిస్తామని అధికారులు హామినిచ్చి ఏడేళ్లు కావస్తోం దన్నారు. భూ దాతలకు ఉపాధి కల్పించకుండా బయట వ్యక్తులకు లోపాయి కారికంగా ఉపాధి కల్పించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధితశాఖ అధికారులు దిగి వచ్చేంత వరకు ఆందోళన దీక్ష కొనసాగిస్తామని వారన్నారు.

## అటవీ భూముల్లో మట్టి తవ్వితే కఠిన చర్యలు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: అటవీ హక్కుల చట్టం ప్రకారం ఏజెన్సీలో కొండపోడు భూములు (ఆర్ఓఎఫ్ఆర్) పట్టాలు ఉన్నప్పటికీ ఆ భూములపై సర్వ హక్కులు ఫారెస్ట్‌కు చెదుతాయని ఆ భూములలో ఎవరైనా అక్రమ మట్టి తవ్వకాలను లేదా తరలించడం వంటివి చేస్తే, అది చట్ట రీత్యా నేరమని రాజవొమ్మంగి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉషారాణి అన్నారు. రాజవొమ్మంగి మండలం సూరంపాలెం గ్రామ శివారు తెల్ల కొండ అటవీ ప్రాంతంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టా కలిగిన గిరిజన రైతు భూమి నుండి జాతీయ రహదారి 516ఇ రోడ్డు పనుల నిమిత్తం అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఫారెస్ట్ సిబ్బంది ఆ ప్రదేశానికి వెళ్ళగా జేసిబి సహాయంతో రెండు ట్రిప్పర్లలో మట్టి లోడ్ చేస్తుండగా అదే సమయానికి తమ సిబ్బంది వెళ్లేసరికి డ్రైవర్లు పరారైనట్లు ఉషారాణి తెలిపారు. మట్టి తరలించేందుకు ఉపయో గించిన రెండు టిప్పర్లు, జేసీబీని స్వాధీన పరచుకున్నామని తెలిపారు. అయితే లారీ, జేసిబి డ్రైవర్లు వాటి తాళాలతో పరారీ కావడంతో తమ సిబ్బందిని కాప లాగా ఉంచి అక్కడ నుండి ఒక్క లారీలు మాత్రమే రాజ వొమ్మంగి అటవీశాఖ కార్యాలయానికి తరలించామన్నారు.

## పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - బెలగాం: పోస్టల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ ఐక్య కార్యాచరణ దశలవారీ పోరాటాలలో భాగంగా ఈనెల 14న దేశ వ్యాప్తంగా డివిజనల్ స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపట్టామని పోస్టల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ కమిటీ నాయకులు తెలిపారు. ఈమేరకు మంగళవారం పార్వతీపురం హెడ్ పోస్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుండి తేది 20-02-2025 వరకు దేశ వ్యాప్తంగా డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరైన నిరసన తెలియజేయాలని, ఈనెల 25న సర్కిల్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించి సమ్మెనోటీసును రాష్ట్ర అధికారులకు అందజేయాలని, మార్చి 3వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాలని మార్చి 10న డిమాండ్లతో కూడిన పోస్టుకార్డులు రాసి పోస్టల్ సెక్రటరీ/డిజిలకు పంపించడం చేయాలని మార్చి 11న కేంద్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈ మెయిల్ క్యాంపెయిన్ నిర్వహించాలని, డిమాండ్లను పరిష్కరించదానికి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోని నేపథ్యంలో మార్చి 18వ నుండి నిరవధిక సమ్మె నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. తపాలా శాఖ ఉనికిని కాపాడుకోవడానికి మరియు ఉద్యోగుల మనుగడ కోసం తపాలా శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి కేడర్లతో సంబంధం లేకుండా అన్ని పోరాట కార్యక్రమాలలో పాల్గొని నూటికి నూరుశాతం విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం నోటీస్ ఇవ్వడం జరిగిందని పోస్టాఫీసు చట్టం- 2023ను తక్షణమే ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లతో నిరసన చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

### - ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు

విశాలాంధ్ర - సీతంపేట: ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. మంగళవారం ఆయన సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని అన్నారు. అదే విధంగా విద్యార్థులు బాగా చదవాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించారు. త్రాగునీటి ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. మరమ్మతులకు గురైన కొళాయిలను వెంటనే బాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీ అన్నదొర, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక రుగ్మతలకు ఆయుర్వేదంతో ఉపశమనం

### ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ హేమాక్షి

విశాలాంధ్ర - సీతానగరం: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు ఆయుర్వేదంతో మంచి ఫలితాలు ఉంటాయని బూర్జ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ తెర్లి హేమాక్షి తెలిపారు. లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలు అనారోగ్య లక్షణాలు, సమస్యలతో శిబిరానికి వచ్చిన గ్రామస్తులకు డాక్టర్ హేమాక్షి ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను స్పష్టంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా వాత వ్యాధులు, జీర్ణ సంబంధిత సమస్యలు,శ్వాసకోశ రుగ్మతలు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు తనిఖీలు నిర్వహించి ఆయుర్వేద మందులు అందజేసారు. వృద్ధులు, మధ్య వయస్కులు శిబిరాన్ని ఎక్కువగా వినియోగించుకున్నారన్నారు. మందులు ఉపయోగించు విధానాన్ని వారికి క్షుణ్ణంగా వివరించారు. డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ మన పరిసరాల్లో అనేక ఆయుర్వేద ఔషద గుణాలున్న మొక్కలు ఉన్నాయని ప్రాచీన కాలం నుండి మన ఆయుర్వేద వైద్య విధానానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని దీర్ఘకాలికంగా ఇబ్బంది పెడుతున్న పలు రుగ్మతలకు ఆయుర్వేదంతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ఏఎన్ఎం పద్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మన్యం జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

విశాలాంధ్ర - కురుపాం: మన్యం జిల్లా అభివృద్ధికి ఫిబ్రవరి 28న జరగనున్న శాసనసభ బడ్జెట్ సమావేశంలో 10 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం కురుపాం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మన్యం జిల్లా పార్వతీపురం తీవ్రమైన అన్యాయానికి గురైందని, పాలించేది ఎవరైనా అన్యాయం జరుగుతూ బడ్జెట్‌లో కేటాయింపులు ఉండ వని ఒకవేళ కేటాయించినా ఖర్చు చేయరని అన్నారు. పాలకుల వివక్షతోనే ఈనాటికి జంఝావతి అలానే ఉందని ఒడిస్సా భూమి 300 ఎకరాలు మునుగుతాయని 50 ఏళ్లుగా నిలిచిపోయిందని మరి ఒరిస్సా, ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణాలో వేలకు వేలు భూమి మునిగినా పోలవరం ఎలా కట్టేస్తున్నారో అంతా పాలకులు, దోపిడివర్గాలు ఇష్టమేనని అమరావతిలో రాజ ధాని కట్టడం, పోలవరం నిర్మాణం చేస్తేనే రాష్ట్రమంతా అభివృద్ధి చెందుతుందని కూటమి నాయకులు చెబుతు న్నారని దానికి మేము వ్యతిరేకము కాదని అమరావతిలో రాజధాని కట్టండి పోలవరం నిర్మాణం పూర్తి చేయండి దానితోపాటు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాలైనా తోటపల్లి, పెద్దగెడ్డ నిర్వాసితుల పునరావాసం పూర్తిచేయలేదని, కాలువలు పూర్తి చేయలేదని, గుమ్మడి గెడ్డపై ప్రాజెక్టు నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారో తెలీదని అన్నారు. వీటన్నిటిపై ఫిబ్రవరి 21వ తేదీన జిల్లాలో అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో కలెక్టరేట్ వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నామని 28న జరుగునున్న బడ్జెట్లో నిధులు కేటాయించకపోతే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి ఆందోళన చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కురంగి సీతారాం, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విలేకరిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: మక్కువ మండల ప్రజాశక్తి విలేఖరి మల్యాడ రామారావుపై దాడి చేసిన టీడీపీ మండల అధ్యక్షులు గుల్ల వేణుగోపాలనాయుడుపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని పార్వతీపురం పట్టణ సిపిఎం నాయకులు పార్వతీపురం పట్టణ నాలుగురోడ్ల కూడలి వద్ద మహాత్మగాంధీగారి విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ సిపిఎం కార్యదర్శి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలపై వార్త రాసినందుకు ప్రజాశక్తి మక్కువ మండల విలేఖరి మల్యాడ రామారావుపై టిడిపి మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల నాయుడు దాడి చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిపిఎం నాయకులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్, సభ్యులు ముట్నూరు వెంకటరమణ ప్రజలు పాల్గొన్నారు.

## సాంప్రదాయ పద్ధతిలో వివాదాలు పరిష్కరించుకోవాలి

విశాలాంధ్ర - అనంతగిరి: గిరిజన ప్రాంతంలో పీసా చట్టం 1996 అమలుపై శిక్షణ కార్యక్రమంలో గిరిజన ప్రాంతంలో వివాదాల పరిష్కారం సాంప్రదాయ పద్ధతిలో పరిష్కరించుకోవాలని అదేవిధంగా అధిక రుణాలు నియంత్రణ వంటివి చేసుకోవాలని పీసా కమిటీ సభ్యులకు సూచించారు. అనంతగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మూడవరోజు పీసా చట్టంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం మూడవ రోజుకు చేరుకుంది. సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు, వార్డు సభ్యులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి, దశలవారీగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఏవివి కుమార్ తెలిపారు. ముఖ్యంగా అటవీ హక్కుల 2006 చట్ట ప్రకారం చిన్న తరహా అటవీ ఉత్పత్తుల వాటిపై పీసాలకు పూర్తి అధికారాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌గా వైస్ రామస్వామి, జి.సంతోషి నలిని వ్యవహరించగా స్వచ్ఛంద సంస్థ నుంచి కె.చంద్రరావులు పాల్గొని తగు సూచనలు ఇచ్చారు. అబ్జర్వర్‌గా విశాఖపట్నం డిటిఎమ్ పి.చంద్రశేఖరరావు పాల్గొన్నట్లు తెలిపారు.

## కుంకీఏనుగు నివాస స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర అటవీ శాఖ కన్జర్వేటర్

విశాలాంధ్ర - సీతానగరం: జిల్లాలో ఎన్నికల గుంపును తరలించేందుకు గాను ఏర్పాటు చేసిన కుంకీఏనుగు నివాస స్థలాన్ని రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కన్సర్వేటర్, విశాఖపట్నం కన్సర్వేటర్ శాంతిప్రియపాండే పరిశీలించారు. మండలంలోని జోగంపేట కొండ ప్రాంతంలో కుంకీ ఏనుగుల కోసం ఏర్పాటు చేసిన స్థావరాలను ఆమె పరిశీలించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని కృప నియోజకవర్గంలో ఏడు ఏనుగుల గుంపు, పాలకొండ నియోజకవర్గం నాలుగు ఏనుగుల గుంపు వలన పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గమనించి వాటిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా కుంకీ ఏనుగులను తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి కొంతమంది అటవీశాఖ సిబ్బందికి కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట జిల్లా అటవీశాఖాధికారి ప్రసూన తదితర అటవీ అధికారులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ పొందిన సురేష్ కుమార్ యువతకు ఆదర్శప్రాయుడు

### వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్

విశాలాంధ్ర - చింతపల్లి: ఇబ్బందులను అధిగమించి ఉన్నత విద్యావంతునిగా ఎదిగిన గిరిజన యువకుడు డాక్టర్ తెడబారికి సురేష్ కుమార్ ఎంతోమంది యువతకు మార్గదర్శకమని వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెల్లీ సుధాకర్ అన్నారు. ఆ పార్టీ చింతపల్లి మాజీ ఎంపీపీ వంతల బాబురావు, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ జల్లి హలియా రాణి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ తాంగుల జగత్ రాయి, వైసీపీ నాయకులతో కలసి డాక్టరేట్ సాధించిన సురేష్ కుమార్‌ను దుశ్సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య పట్ల మక్కువతో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించి నేడు డాక్టరేట్ పట్టా పొందిన సురేష్ కుమార్ తోటి యువతకు ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అభిమానులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి సమస్యను రానివ్వం: సర్పంచ్ పుష్పలత

విశాలాంధ్ర - చింతపల్లి: రాబోవు వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని చిలకల మామిడి గ్రామం, సాడిపేట వీధిలలో నూతన బోర్ల నిర్మాణానికి సంబంధించి జియాలజిస్ట్ చేత నీరు పడే ప్రదేశాలను గుర్తించడం జరిగిందన్నారు. అదే క్రమంలో సాయి నగర్ వీధిలో మరమ్మతులకు గురైన మోటారు, పానెల్ బోర్డులను మరమ్మతు చేయించడం జరిగిందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర నిధులతో సాయి నగర్‌లో మంజూరు చేసిన బోరును పరిశీలించి ఈ బోర్‌కు నూతన మోటారు వేయించి సాయి నగర్ వీధిలో నివసిస్తున్న ప్రజలకు, అదేవిధంగా ఆర్ అండ్ బి కార్యాలయం వెనక గల వీధికి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ వసతి గృహ పాఠశాల వెనుక వీధికి చెందిన ప్రజలకు నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, హేమంత్, జియాలజిస్ట్, చిలకల మామిడి, సాడీ పేట, సాయి నగర్ వాసులు పాల్గొన్నారు.

## పెట్టుబడి పెట్టకుండా ఆదాయం సంపాదించుకునే అవకాశం

### బిజినెస్ అవకాశం టీమ్ వర్కర్ షబీనా

విశాలాంధ్ర - చింతపల్లి: పైసా పెట్టుబడి పెట్టకుండా రోజుకు రెండు గంటల నుంచి నాలుగు గంటల పాటు పనిచేసే నెలకు పదివేల నుంచి 30 వేల వరకు ఆదాయం సంపాదించుకునే అరుదైన వ్యాపార అవకాశాన్ని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని టీం వర్కర్ షేక్ షబీనా అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఉద్యోగం రాలేదని, ఆదాయం సరిపోలేదని, అప్పులు తీరలేదని బాధపడకుండా మీ ఆర్థిక సమస్యలన్నింటికీ చక్కటి పరిష్కార మార్గం చూపించే వ్యాపార అవకాశం లో ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టకుండా రోజుకు రెండు నుంచి నాలుగు గంటల పాటు పని చేసి నెలకు పదివేల నుంచి 30 వేల ఆదాయం సంపాదించుకునే సువర్ణ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పదవ తరగతి పైబడి ఉత్తీర్ణత పొందిన నిరుద్యోగ యువతి, యువకులు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, మహిళలు ఇంటి వద్ద నుంచి ఖాళీగా ఉండకుండా ఇంటి నుంచి ప్రజలకు వ్యాపార అవకాశంపై అవగాహన కల్పించి అందులో చేరితే ఇంటి అవసరాలను తీర్చుకునేందుకు రోజుకు సరిపడే ఆదాయం సంపాదించుకోవచ్చునని ఈ సందర్భంగా ఆమె వివరించారు. వివరాలకు 9110520592 లో సంప్రదించాలని ఆమె కోరారు.

## మహిళలు అక్షరాస్యత కలిగి ఉండాలి: ఎస్ఐ

విశాలాంధ్ర - చింతూరు: చదువుకున్న మహిళలు ఏ ఇంట్లో ఉంటే ఆ ఇంటితోపాటు గ్రామం బాగుపడుతుందని చింతూరు ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు. చింతూరులోని శాపిడ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన అన్ని రంగాల్లో మహిళలు లీడర్ షిప్ సాధించడం అనే అంశంపై ఎస్ఐ మాట్లాడారు. చదువుతో అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు గురించి, బాల్య వివాహాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై సోదాహరణంగా వివరించారు. అలాగే మహిళలు మావోయిస్ట్ భావజాలంపై మొగ్గు చూపగూడదని, వారికి సహకరించకూడదని, వారికి సహకరిస్తే నేరస్తులు అవుతారని అన్నారు. మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. స్త్రీల వ్యాధులు వాటి నివారణ గూర్చి ప్రభుత్వ వైద్యశాల గైనకా లజిస్ట్ వెంకట రమణ మాట్లాడారు. పొదుపు పథకాలు, డిపాజిట్లు గూర్చి ఎస్బిఐ ఎర్రంపేట మేనేజర్ ప్రసన్న కుమార్ మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాపిడ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ అహ్మద్ అలీ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

విశాలాంధ్ర
పేజీ : 3
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
బుధవారం 19, ఫిబ్రవరి 2025

# పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయండి

## కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర - దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు సంబంధించిన ఆర్ అండ్ ఆర్ కాలనీలలో పెండింగ్ పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన పినికిలపాడు గ్రామానికి సంబంధించిన బాధితులకు పెద్ద బీంపల్లి 2లో, కొండ మొదలు, మెట్టగూడెం, తాళ్లూరు, తెలిపేరు, తాడివాడ గ్రామాలకు సంబంధించిన బాధితులకు పెద్ద బీం పల్లిలో మొత్తం రెండు కాలనీలలో 276 కుటుంబాలకు ఆర్అండ్ ఆర్ కాలనీలలో పెండింగ్ లో ఉన్న స్కూల్ భవన పనులు అంగన్వాడి కేంద్రం పనులు, గ్రామ సచివాలయ భవన పనులు శ్మశాన వాటిక పెండింగ్లో ఏమైనా ఉన్న వాటిని వెంటనే పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కొంతమంది ముంపు బాధితులు ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తిస్థాయిలో మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ వారి దృష్టికి కొంతమంది బాధితులు తీసుకురాగా వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రానివారికి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయించి అర్హతను బట్టి ప్రభుత్వ నిబంధన ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట తహశీల్దార్ కరక సత్యనారాయణ, ఎంపీడీవో రత్నకుమారి, డిప్యూటీ తాసిల్దార్ త్రిమూర్తులు, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# మిలీషియా కమాండర్ లొంగుబాటు

విశాలాంధ్ర - ఎటపాక: సిపిఐ మావోయిస్టు గొంపాడ్ ఆర్పీసీ మిలీషియా కమాండర్ మడకం రామ మంగళవారం ఎటపాక పోలీసు స్టేషన్లో రంపచోడవరం ఓఎస్డీ జగదీష్ ఆడహళ్లి ఎదుట లొంగిపోయాడు. పత్రికా సమావేశంలో ఓఎస్డీ వివరాలు వెల్లడించారు. మడకం రామ గొంపాడ్ గ్రామం మైత పంచాయతీ ,సుక్మా జిల్లా,ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం.2014 సంవత్సరం లోనే 14 సంవత్సరాల వయస్సులో సిపిఎం కమాండర్ దీర్ఘో భీమా, మిలీషియా సభ్యుల ప్రేరణతో బాలల సంఘం లో జాయిన్ అయ్యాడు. 2018లో సోలంపల్లి ఎల్.ఓ ఎస్ సభ్యుడిగా నియమింపబడ్డాడు. ఆ సమయంలో బిజిఎల్ ఆయుధం తో పాటు 12 సెల్లులు కేటాయించారు.2019 సంవత్సరం,2021 సంవత్సరంలో బేజ్జి పోలీసు స్టేషన్ ఎదుట పోలీసుల హతమార్చలనే ఉద్దేశ్యంతో జరిపిన దాడిలో ఇద్దరు పోలీసులు మరణించారు.ఈ ఘటనలో పాల్గొన్నాడు. అదే సంవత్సరం ఎర్రబోరు అటవీ ప్రాంతంలో 7 లారీలను దగ్ధం చేసిన ఘటనలో ఇతను పాల్గొన్నాడు.2023 లో వేలిపోచ గ్రామ శివార్లలో రెండు టాటా మ్యాజిక్లు దగ్ధం చేసిన ఘటనలో, అదే సంవత్సరం పోలీసులును హతమార్చలనే ఉద్దేశ్యంతో మిలీషియా సభ్యులుతో ఐఈడిలు అమర్చిన ఘటనలో పాల్గొన్నాడు.2024 లో కుంట పోలీసు స్టేషన్ పరిధిలోఎన్నికల పోలింగ్ బూత్ మీద కాల్పులు జరిపిన ఘటనలో పాల్గొన్నారు.మావోయిస్టు సిద్ధాంతాలుకు విసిగిపోయి, మావోయిస్టులో ఆదరణ తగ్గి, మావోయిస్టు పార్టీ వీడి సాధారణ జీవితం గడపాలని నిర్ణయించుకున్నాడన్నారు. మావోయిస్టు పార్టీ వీడిన వారికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎటపాక సిఐ కన్నపరాజు, సీఆర్పీఎఫ్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కస్తూరిబా పాఠశాలను సందర్శించిన ఏపీసీ

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులోని కస్తూరిబా బాలికల పాఠశాలను జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ స్వామినాయుడు మంగళవారం సందర్శిం చారు. పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థినులకు భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని విద్యార్థినులకు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఉదయం అల్పాహారం సమయంలో విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అలాగే పెరిగిన పేర్మాష్ట్ ప్రకారం మెనూ పెడుతున్నారా లేదా అంటూ ప్రిన్సిపాల్ను అడిగి తెలుసుకున్నారు. అదే విదంగా పదవ తరగతి, ఇంటర్ విద్యార్థినులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిణి రమాదేవి, ఉపాధ్యాయినిలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర - బలిజిపేట: మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరిపై జరిగిన దాడిని ఖండిస్తూ బలిజిపేట మండలం విలేకరులు మంగళవారం స్థానిక బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ధర్నా నిర్వహించి ర్యాలీ చేసి ఎస్సై ఎస్.సింహాచలంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు మాట్లాడుతూ మక్కువ మండల ప్రజాశక్తి విలేఖరి మల్యాడ రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షుడు, ఏ.వెంకంపేట గ్రామానికి చెందిన గుల్ల వేణుగోపాల్ నాయుడు దాడి చేయడం తగదన్నారు. అతడికి వేణుగోపాల్ నాయుడు నుండి రక్షణ కల్పించాలని, దాడి చేసిన అతనిపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేకరి మురళి, ఆంధ్రజ్యోతి విలేఖరి లక్ష్మణరావు, విశాలాంధ్ర విలేకరి నాయుడు, కథనం విలేకరి మురళి, నిజం విలేకరు జై రాము ఇతర విలేకరులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

విశాలాంధ్ర - గంగవరం: పూర్వ విద్యావిధానం 2020 ప్రకారం 3-6 సంవత్సరాల పిల్లల్లో పూర్వ ప్రాథమిక విద్య - సంరక్షణ ఈసిసిఈ మెరుగుపరచే ఉద్దేశ్యంతో అంగన్వాడి కార్యకర్తలకు 120 రోజుల జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సును రూపొందించడం జరిగిందని సిడిపిఓ సిహెచ్ లక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమాన్ని సిడిపిఓ సిహెచ్ లక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి (2) టి.మల్లేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిడిపిఓ లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు ఏడాదిలో 40 రోజుల పాటు మూడు సంవత్సరాల పాటు 120 మందికి ఆన్లైన్, ఆఫ్లైన్

ప్రాతిపదికన కూల్ ఎడ్యుకేషన్ వారి సహకారంతో ఈసిసిఈపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా మొదటిదశ 6 రోజుల శిక్షణ కార్యక్రమం గంగవరం ఆశ్రమ స్కూల్ నందు 18 నుంచి 20 వరకు, 22 నుంచి 25 వరకు మొత్తం 6 రోజుల శిక్షణ ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్పిలుగా విద్యా శాఖ నుంచి సిహెచ్ కృష్ణ, ఎస్.రాజేశ్వరి, ఏ.నాయుడు, ఐసిడిఎస్ శాఖ నుంచి ఐసిడిఎస్ సూపర్వైజర్లు టి.సత్యవతి, వి.విజయలక్ష్మి వ్యవహరించగా మొదటి రోజున 41 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## లచ్చయ్యపేట సచివాలయంను సందర్శించిన అధికారులు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట సచివాలయాన్ని ఎంపీడీవో పాండ్రంకి త్రివిక్రమరావు, పంచాయతీ విస్తరణ అధికారి కుమార్ వర్మలు మంగళవారం సందర్శించారు. సచివాలయం పరిధిలో చేయాల్సిన పనులను పరిశీలించారు. అప్లోడ్ చేయాల్సిన అంశాలపై వివరించారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు గూర్చి, గోశాలల నిర్మాణం గూర్చి, అభివృద్ధి పనులు గూర్చి సచివాలయసిబ్బందితో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో అప్లోడ్ చేయాల్సిన వివరాలను వివరించారు. రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. గ్రామంలో సోలార్ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలి అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో కాలువల్లో పేరుకుపోయిన పూడికతీతను తొలగించాలన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి సంతోష్ కుమార్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దేవతలు నిర్మించిన శివాలయానికి హంగులు

## ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న ఎంపీడీవో "లోకుల యాదగిరిశ్వరరావు"

విశాలాంధ్ర - కొయ్యూరు: దేవతలు నిర్మించిన స్వయంభు శ్రీ బ్రహ్మా లింగేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి ఆమడ దూరంలో ఉండడంతో కొంతమంది భక్తులు ముందుకు వచ్చి అభివృద్ధి చేసేందుకు పూనుకుంటున్నారు. ఈ ఆలయానికి ఆలయ ధర్మకర్తగా అయిన స్వర్గీయ కించే ఎర్రయ్య దొర వ్యవహరించే వారు. అలాగే ఈ ఆలయానికి నిధులు సమకూర్చేందుకు కొంత భూమిని కూడా కేటాయించారు. కానీ ఆ భూమిపై అనుకున్నంత స్థాయిలో రెవెన్యూ రాకపోవడంతో ఎవరు కూడా అంతగా ఈ ఆలయాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో కొయ్యూరు మండలం పి మాకవరం గ్రామంలో ఉన్న శివాలయానికి గత గత కొన్నేళ్లుగా ఆదరణ లేక ఆలయం కూలిపోయి నిలువ నీడ లేకుండా దర్శనమిచ్చేది. అయితే కృష్ణ దేవి పేట గ్రామానికి చెందిన రావి శ్రీను ఆర్థిక సహకారంతో గత ఏడాది గుడి పైన రేకుల షెడ్డును లక్ష రూపాయలు నిధులతో నిర్మాణాలు చేపట్టారు. అలాగే గుడికి ఎటువంటి రక్షణ లేకపోవడంతో శరభన్నపాలెం గ్రామానికి చెందిన అల్లూరు జిల్లా రాజవొమ్మంగి మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా విధులు నిర్వహిస్తున్న లోకుల యాదగిరిశ్వరరావు ఆలయానికి చుట్టూ రక్షణ గోడతోపాటు ఇనుప గ్రిల్స్ను కూడా ఏర్పాటు చేయిస్తున్నారు. రానున్న శివరాత్రి ఉత్సవాలకు పనులు పూర్తి చేయించాలని సంకల్పంతో ధార్మిక సంస్థల

సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పనులు చురుగ్గా చేపడుతున్నారు. అలాగే మరి కొంతమంది దాతలు భక్తులు ముందుకు వచ్చి ఈ పురాతన దేవతల ఆలయాన్ని మరిన్ని హంగులు కల్పించి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా ఇక్కడికి వచ్చే భక్తులందరికీ మంచినీటి సదుపాయం ఉండేటట్లు కనీసం పంచాయితీ పాలకవర్గమైన చర్యలు చేపట్టాలని మరికొందరు భావిస్తున్నారు

## పునరావాస కాలనీలే పూర్తికాలేదు...

# నిర్వాసితులను ఎలా తరలిస్తారు..?

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని 41.15 కాంటూర్లో గల గ్రామాలను పునరావాస కాలనీలకు తరలిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనీ ఆ పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ అన్నారు. మంగళవారం నాడు పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ నిర్వాసితులకు ఇచ్చినటువంటి కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు నేటి వరకు కల్పించలేదని. రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచలేదని అంగన్ వాడి ,స్కూల్ భవనాలు పూర్తిగా నిర్మించలేదని అటువంటి అప్పుడు నిర్వాసితులను అక్కడికి పంపి ఎక్కడ ఉంచుతారు అని ప్రశ్నించారు. ముంపులో ఉన్నటువంటి గ్రామాలలో పోడు , అసైన్డ్ భూములకు నష్టపరిహారం నేటి వరకు అందించలేదనీ అన్నారు. చొక్కనపల్లి గ్రామానికి పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయిగూడెం మండలం రామన్నగూడెం లో కాలనీ నిర్మించారని వారికి రావలసిన భూమికి భూమి నేటి వరకు అధికారులు చూపించలేదని వారు అక్కడికెళ్లి ఏం చేసుకొని బతుకుతారు అని ప్రశ్నించారు. కొటారు గొ మ్ము గ్రామంలోని కొండరెడ్ల కుటుంబాలకు మారేడుపూడి గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో దాదాపు 270 ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చారని వారి గ్రామాన్ని ఖాళీ చేస్తామంటున్నారు వారి భూమికి పరిహారం ఇస్తారా ?వారి బతుకుదెరువు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. గ్రామాలనే ఖాళీ చేయాలనుకుంటే సత్వరమే అట్టి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి భూ పరిహారాలు మొత్తం చెల్లించి పునరావాస కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించి అప్పుడు తరలించాలని అన్నారు. 2017 కట్ ఆఫ్ తేదీ ప్రకటించి 18 సంవత్సరాలు నిండిన యువతి యువకుల కు ఆర్ అండ్ ఆర్,పునరావాసం లేకుండా చేసింది ఈ ప్రభుత్వాలు కాదా?వారి పరిస్థితి ఏమిటి? ఈరోజు అక్కడికి వెళ్లి వారి భార్య పిల్లలతో ఎక్కడ జీవనం సాగించాలి?ఇదేమి ప్రభుత్వానికి పట్టదా?వారి బ్రతుకులు రోడ్డుపాలేనా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్ అండ్ ఆర్, పునరావాసం కల్పించాలి లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.ఈ కార్య క్రమం లో జిల్లా నాయకులు సున్నం రాజులు, సోయం చినబాబు, మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామ్మూర్తి, ఫంకు సత్తిబాబు, గుండుపూడి లక్ష్మణరావు, శీరపు తాతబాబు, కమ్మచిచ్చు సత్యనారాయణ, కారం సుందరయ్య, కారం సత్తిబాబు, తుర్రం బాబురావు, వద్లాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోడి వ్యర్థాలతో చేపలు పెంపకం

- కుళ్లిపోయిన కోడి మాంసం, పశు వ్యర్థాలు
- పర్యావరణానికి పెను ప్రమాదం
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - ఎటపాక: ఆరోగ్యకరమైన మేత వేసి చేపలను పెంచాలి. కానీ కుళ్లిన కోళ్ల మాంసం, పశు వ్యర్థాలు తిని పెరిగిన చేపలు విషతుల్యమే. ఇవి తింటే ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలుతాయి. సంపాదనే లక్ష్యంగా చేపలు పెంచుతున్నవారికి ఇవేవి పట్టవు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారు. దీంతో ఆ పొలాల్లో భారీ స్థాయిలో గుంతలు ఏర్పడ్డాయి. కొందరు మత్స్యకారులు రాయాన పేటలో ఇలాంటి గుంతల్లో చేపలు, పెంచుతున్నారు. ఈ చేపలకు మత్స్యశాఖ సిబ్బంది సూచించిన సహజ సిద్ధమైన ఆహారం అందించాలి. అయితే దీనికి బాగా ఖర్చు వస్తుంది. అందుకని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు చికెన్ సెంటర్లో మిగిలిపోయిన కోళ్ల వ్యర్థాలు, తెగులు వచ్చి చనిపోయిన కోళ్ల మాంసం ఉడికించి చేపలకు ఆహారంగా వేస్తున్నారు. పశు మాంస వ్యర్థాలను కూడా కోళ్లకు దాణాగా వేస్తున్నారు. ఇవి తిని చేపలు మవిషతుల్యంగా మారుతున్నాయి.

ఆరోగ్యానికి హానికరం

తెగులు వచ్చి చనిపోయిన కోళ్ల మాంసం, వ్యర్థాల్లో ఇకోవాలా బ్యాక్టీరియా ఉంటుంది. ఈ చేపలు తినడం వల్ల నడుము నొప్పులు, కాళ్ల నొప్పులు, నీరసం, లివర్ దెబ్బతినడం, కామెర్లు వస్తాయి. కిడ్నీలు దెబ్బతింటాయ. మహిళలకు గర్భస్రావం అవుతుంది. కోళ్ల వ్యర్థాల వల్ల చేపల చెరువులోని నీరు తీవ్రస్థాయిలో కలుషితం అవుతుంది.

పర్యావరణానికి ప్రమాదం

ఇలా చేపల్ని పెంచుతున్న చెరువులోని కలుషితమైన నీటిని .మురికి నీరు వదులుతున్నారు. దీంతో కుందూ నదిలోని చేపలు, నీరు విషతుల్యం అవుతున్నాయి. ఈ కలుషిత నీటిని తాగడం వల్ల డయేరియా, రక్త విరేచనాలు, కలరా, టైఫాయిడ్, తదితర వ్యాధులు వస్తున్నాయి. ఈ నీటిని పంట పొలాలకు సాగు నీరుగా వినియోగిస్తే పంటలు తెగుళ్ల బారిన పడి దిగుబడి తగ్గిపోతాయి. కోళ్ల వ్యర్థాలు, కోళ్ల మాంసం ఉడక బెట్టడం వల్ల పరిసరాలు దుర్వాసన వెదజల్లుతుంటాయి. సరిహద్దు ప్రాంతమైన భద్రాచలం చికెన్ మార్కెట్లనుండి

వకడ్బందీగా కుళ్లిన కోళ్ల మాంసం, వ్యర్థాలను ఎటపాక మండలంలోని రాయన పేట లోనీ మంగువాయి చేపలు చెరువులో కుళ్లిన కోళ్ల మాంసం, వ్యర్థాలు పకడ్బందీగా రవాణా చేస్తున్నారు. అసలే బర్డ్ ఫ్లూ ప్రభావంతో కోళ్ళు, చికెన్ అమ్మకాలు ఆపేశారు. మంగు గువాయి చెరువులో చేపలకు ఆహారం వేసేందుకు భద్రాచలం ప్రాంతాలలోని చికెన్ సెంటర్లలోని కోళ్ల వ్యర్థాలు, తెగులుతో మరణించిన కోళ్ల మాంసం బొలేరో, ఐరిస్ వాహనాల ద్వారా రాత్రి 12 గంటలకు చేపల చెరువుల వద్దకు చేరుస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

చేపల పెంపకానికి కుళ్లిన కోళ్ల మాంసం, కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చేపలు, సాగుకు తహసీల్దార్ అనుమతి తీసుకోవాలి. చేపలకు కోళ్ల వ్యర్థాలు ఆహారంగా వేసినా, ఇలాంటి పదార్థాలను అక్రమంగా తరలించినా వారిపై కేసులు నమోదు చేయాలి. కానీ పోలీసు, రెవెన్యూ, మత్స్య శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక మామూళ్ల దందా కొనసాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆరోగ్య వాతావరణంలో చేపలు పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.